భక్తి శ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

ఏసుక్రీస్తు లోకరక్షణకే బలిదానం చేశాడని మత పెద్దలు తెలిపారు. ఏసు సిలువ వేసిన రోజున సందర్భంగా జరుపుకునే గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా సిలువను మోస్తూ భారీ ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించి ఏసుబోధనలను స్మరించుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్


చంద్రుగొండ: సిలువ మార్గంలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

లోక రక్షణకే బలిదానం


ములకలపల్లిలో..


భద్రాచలంటౌన్: చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


చర్ల: చర్చిలో పాస్టర్ బోధనలు వింటున్న క్రైస్తవులు



మణుగూరు టౌన్: సిలువ యాత్ర.. , పీవీ కాలనీలోని సెయింట్ పాల్స్ చర్చిలో ప్రార్థనలు


అశ్వారావుపేటరూరల్: సిలువ యాత్ర చేస్తున్న క్రైస్తవులు


బూర్గంపాడు: సోంపల్లి బేతేలు ప్రార్థన మందిరంలో..

క్లుప్తంగా

సెక్యూరిటీ గార్డులకు యూనిఫాం ఇప్పించండి

మణుగూరు టౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డ్‌లకు ఖాకీ యూనిఫాం ఇవ్వాలని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్‌ఓటూ జీఎం శ్యాం సుందర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇఫ్టూ ఏరియా అధ్యక్షుడు మంగీలాల్ మాట్లాడుతూ.. ఏరియాలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్స్‌కి ఖాకీ యూనిఫాం ఇచ్చే విషయంలో కాంట్రాక్టర్ అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాడని దీంతో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్‌కుమార్, ఆంజనేయులు, వీరబాబు, వై.ప్రభాకర్ పాల్గొన్నారు.

రామాలయానికి వీల్‌చైర్ వితరణ


వీల్‌చైర్ అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానానికి మహబూబాబాద్ జిల్లాకి చెందిన హోప్ స్టెప్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం వీల్‌చైర్‌ను ఆలయ ఈవో రమాదేవికి వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ రమాదేవి మాట్లాడుతూ... స్వామివారి దర్శనానికి వచ్చే దివ్యాంగ, వృద్ధులకు ఈ వీల్ చైర్ ఉపయోగంగా ఉంటుందని ఈ మేరకు ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు నాగవెల్లి శ్రీనివాస్, సభ్యులు సిలువేరు హరీష్, కుర్రే శ్రీనివాస్, చెరుకుపల్లి రమేష్, విజ్జగిరి రవితేజ. శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు తీసుకోవాలి

ములకలపల్లి: అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్ఎఫ్‌డీసీ) ఆధీనంలో ఉన్న భూముల్లో అగ్ని ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని కోరుతూ సామాజిక కార్యకర్త పి.క్రాంతి ఆధ్వర్యంలో సంస్థ కొత్తగూడెం డివిజన్ మేనేజర్ చంద్రమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్థ పరిధిలోని 62 వేల ఎకరాల ప్లాంటేషన్లలో వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. దీంతో పర్యావరణ కాలుష్యం ఏర్పడుతోందని, జంతుజాలం అకాల మృతి చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సోయం చిన్నారి, మడివి రాము, తాటి రవి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత


సరుకులు అందజేస్తున్న నరేష్

దుమ్ముగూడెం : మండలంలోని పర్ణశాల పంచాయతీ పరిధిలో సీతానగరం జయంతి కాలనీలో అగ్నిప్రమాదంలో ఇల్లు కోల్పోయిన బాధిత వృద్ధ దంపతులకు ఇల్లెందు మార్కెట్ కమిటీ సెక్రెటరీ ఇర్రి నరేష్ 25 కేజీల బియ్యం , దుప్పట్లు, నిత్యావసర సరుకులు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో రంజిత్, సదానందం, రవి, చందర్, కొప్పుల నారాయణ, ఈటే వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ఆవిర్భావ వేడుకలు..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద శుక్రవారం టీడీపీ ఆవిర్భవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు పార్టీ జెండ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కుంచాల రాజారాం, అభినేని శ్రీనివాస్, కంభంపాటి సురేష్‌కుమార్, తాళ్లూరి చిట్టిబాబు, ప్రకాష్‌రావు, రేపాక రాంబాబు, దాసయ్య, వెంకటేశ్వరరావు, అచ్యుతరావు, రామకృష్ణ. అనసూయ, గౌతమి, సీత, మణి పాల్గొన్నారు. **ములకలపల్లి:** టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలో నాయకులు గంగిశెట్టి సత్యనారాయణ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు తేళ్ల చెన్నయ్య, మిరియాల శంకర్‌రావు, పువ్వాల శ్రీనివాస్, వంజరపు ఉమేశ్, చవ్వా ప్రసాద్, మలిశెట్టి సుధాకర్, నరుకుళ్ల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

నివాళి..

దమ్మపేట: మండల పరిధిలోని నాచారం గ్రామానికి చెందిన గూడపాటి భద్రయ్య శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందగా మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు భద్రయ్య మృతదేహాన్ని సందర్శించి, పూలమాలలతో నివాళులర్పించారు. అదేవిధంగా కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్ భద్రయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపారు.

తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టాలి


మాట్లాడుతున్న సుధాకర్

మణుగూరు రూరల్: మూడు రోజులుగా తాగునీరు రాక మణుగూరు మున్సిపాలిటీ ప్రజలు అవస్థలు పడుతున్నారని తక్షణమే తాగునీటి సరఫరా మెరుపడేలా చర్యలు చేపట్టాలని సీపీఐ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ అధికారులను డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... మున్సిపల్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు సోందే కుటుంబరావు, తోట రమేష్, ఎస్‌వి నాయుడు, జక్కల రాజబాబు, రాయల భిక్షం, కొత్తపల్లి సీతారాములు, ప్రసాద్, ఎం కోటి, రాములు, ఆర్ రాములు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా వంశీకృష్ణ

కొత్తగూడెంరూరల్: కాంగ్రెస్ పార్టీ జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షుడిగా వంశీకృష్ణను నియమిస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ శుక్రవారం నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ... పార్టీ ఆదేశాలను పాటిస్తూ, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు. ఈ మేరకు తన నియామకానికి కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

అశ్వారావుపేటరూరల్: త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీ పార్టీను ఓడించాలని సీపీఐ ఎంఎల్–మాస్‌లైన్(ప్రజాపంథ) జిల్లా నాయకులు కంగాల కల్లయ్య కోరారు. శుక్రవారం మండలంలోని కావడిగుండ్ల గిరిజన గ్రామంలో ఆ పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో మూడో సారి అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తుందని, ఇంకొసారి బీజేపీకు అవకాశం ఇవ్వొద్దని పిలుపునిచ్చారు. బీజేపీ పాలనలో మతోన్మాదం పెరిగిపోయిందని, ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతుందన్నారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ వాసం బుచ్చిరాజు, నాయకులు వెంకటేష్, జెడ్డి బుచ్చయ్య, పోతురాజు, భీమరాజు, గోపాలరావు, చిన్న లక్ష్మీ, సావిత్రి, సింగారమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం


వైద్యపరీక్షలు చేస్తున్న శివకుమార్

మణుగూరు రూరల్ : మండలంలోని లంకమల్లారం పంచాయతీ పరిధిలోని టీటీడబ్ల్యూఆర్‌జేసీ బాలికల గురుకులంలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి దగ్గు, జలుబు, జ్వరం వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి నివారణ మందులను పంపిణీ చేశారు. అనంతరం వైద్యాధికారి శివకుమార్ ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిశాంత్‌రావు, వైద్యసిబ్బంది రాంప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ హిమబిందు, శ్రీకాంత్, సుమ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కోటేశ్వరరావు

మణుగూరు టౌన్: లయన్స్‌క్లబ్ మణుగూరు ఆధ్వర్యంలో ప్రముఖ వ్యాపారి బేతంచర్ల వెంకటేశ్వరరావు సహకారంతో ఎస్‌బీఐ సెంటర్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని డాక్టర్ కోటేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దాత బేతంచర్ల వెంకటేశ్వరరావు, లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ గాజుల పూర్ణచంద్రరావు, సెక్రటరీ మీరా హుస్సేన్, గాజుల రమేశ్, అడబాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వారాంతపు సంత వేలం

గుండాల: మండలకేంద్రంలో జరిగే వారాంతపు సంతకు శనివారం వేలంపాట వేయనున్నట్టు పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్ సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్న ఈ వేలంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

విఘ్నేశ్వరుడికి వెండి మందారమాల బహూకరణ


వెండి అభరణాన్ని అందజేస్తున్న దాతలు

మణుగూరు రూరల్ : మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ సాయినగర్ ప్రాంతంలో వేంచేసియున్న శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలోని శ్రీ విజయ విఘ్నేశ్వరస్వామి అలంకరణకు శుక్రవారం వెండి మందారమాల బహూకరించారు. మణుగూరు పట్టణంలోని ప్రముఖ శ్రీ హరిసాయి జ్యూయలరీ షాపు యజమాని ఆబోతుల రమణ మంగ దంపతుల కుమార్తెలు సంకటచతుర్థి సందర్భంగా 111 గ్రాముల వెండి మందారమాలను అర్చకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పవన్‌కుమార్ వర్మ, ఆలయ కమిటీ సభ్యులు, సాయి సేవకులు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు కనెక్షన్ ఇచ్చారు..

సాక్షి ఎఫెక్ట్..


బోరు మెటారు నుంచి ట్యాంకుకు కనెక్షన్ ఇచ్చిన దృశ్యం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నందిపాడు పంచాయతీ పరిధిలోని కుడుములపాడు గిరిజన గ్రామంలో తాగునీటి బోరుకు శుక్రవారం మెటారు నుంచి ట్యాంకుకు కనెక్షన్ ఇచ్చారు. మోటారు ఏర్పాటు చేసి ఇరవై రోజులు దాటుతున్న ట్యాంకుకు కనెక్షన్ ఇవ్వకపోవడంపై ఈ నెల 27న సాక్షిలో ప్రచురితమైన 'బోరు వేశారు.. కనెక్షన్ మరిచారు' అనే కథనానికి అధికారులు స్పందించారు. స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మీ ఆధ్వర్యంలో సిబ్బంది వాటర్ ట్యాంకు వద్ద నూతనంగా వేసిన బోరు నుంచి పైపులైను వేసి మిషన్ భగీరథ ట్యాంకుకు కనెక్షన్ ఇచ్చారు.

ఆర్‌అండ్‌బీ నిబంధనలు అమలు చేయాలి


మాట్లాడుతున్న నూపా భాస్కర్

ములకలపల్లి: సెంట్రల్ లైటింగ్ పనుల్లో భాగంగా రోడ్లకిరువైపులా 50 అడుగులమేర నిర్మాణాలను కచ్చితంగా తొలగించాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మాస్‌లైన్ జిల్లా నాయకులు నూపా భాస్కర్ మాట్లాడారు. ఆర్‌అండ్‌బీ నియమ నిబంధనలు మేరకు 50 అడుగుల పరిధిలో ఎలాంటి నిర్మాణాలు ఉండకూడదని, భవిష్యత్ అవసరాల దృష్ట్యా 50 అడుగుల కోసం పోరాటం చేస్తున్న తమను, చిరువ్యాపాలకు వామపక్షాలు వ్యతిరేకమంటూ కొందరు దుష్ప్రచారానికి పాల్పడుతున్నారన్నారు. 50 అడుగుల విషయమై కలెక్టర్, జేసీ సమక్షంలో విచారణకు సిద్ధమని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, సీపీఐ మండల సహాయ కార్యదర్శి నరాటి రమేష్, ఊకంటి రవికుమార్, అనుమల సాయి, గడ్డం వెంకటేశ్వర్లు, నిమ్మల మధు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసు ఎత్తివేయాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

మణుగూరు రూరల్: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీపై విధించిన అక్రమ కేసును ఎత్తివేయాలని ప్రగతిశీల మహిళా సంఘం భద్రాచలం డివిజన్ కమిటీ గౌరవ అధ్యక్షురాలు పెద్దగోని ఆదిలక్ష్మీ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన ప్రచార పోస్టర్లను ఆమె కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పార్టీపై విధించిన పూసపల్లి కేసును ఎత్తివేయడంతో పాటు రాష్ట్రంలో ఉపా చట్టం క్రింద నమోదు చేసిన కేసులన్నింటినీ ఉపసంహరించుకోవాలన్నారు. ఎన్ఐఏ దాడులు ఆపాలని, ప్రజాస్వామిక పద్ధతిలోనే పాలన కొనసాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ డివిజన్ అధ్యక్షురాలు కొడిమి రాధ, సభ్యులు ఆర్ లక్ష్మీ, ఇఫ్టూ నాయకులు సాధనపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ..


నివాళులర్పిస్తున్న దిండిగల రాజేందర్

దమ్మపేట: మండలంలోని మొద్దులగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు దొడ్డా రమేష్ తండ్రి వెంకటేశ్వరరావు ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్ పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. నాయకులు మంతపురి రాజ్‌గౌడ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నా.. పట్టించుకోరా..?

రహదారిపై భయపెడుతున్న మలుపులు

- హెచ్చరిక బోర్డులనూ ఏర్పాటుచేయని అధికారులు
- నిత్యకృత్యమైన ప్రమాదాలు..
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ శాఖ


ప్రమాదాలకు నిలయంగా మారిన రాళ్లగూడెం మలుపు

చర్ల: చర్ల మండలంలోని పలు గ్రామాల్లో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిలో ఉన్న మలుపులు ప్రయాణం అంటేనే భయపడేలా చేస్తున్నాయి. ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నా పట్టించుకోరా అని వాహనదారులు వాపోతున్నారు. ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు పట్టించుకోకపోవడంతో పెద్ద సంఖ్యలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రాళ్లగూడెం, గోగుబాక, కలివేరు, తేగడ, సీ కత్తిగూడెం, కొయ్యూరు, సుబ్బంపేట తదితర గ్రామాల్లో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై ఉన్న మలుపులలో రహదారిపై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడు బ్రేకర్లు గానీ, ప్రమాద స్థాయిని తెలిపేందుకు సూచిక బోర్డులు గానీ ఏర్పాటు చేయలేదు. దీంతో వేగంగా ప్రయాణిస్తున్న వాహనాలు ఎదురెదురుగా వస్తూ దగ్గరికి వచ్చేంత వరకు కనిపించకపోతుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

ఇటీవల చర్ల మండలంలోని పలు గ్రామాలలో ఆర్‌అండ్‌బీ రహదారిపై పలు చోట్ల స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేసినప్పటికీ ప్రమాదాలు చోటు చేసుకుంటున్న మలుపులలో ఏర్పాటు చేయకపోవడాన్ని ప్రజానీకం తీవ్రంగా తప్పుపడుతున్నారు. మండలంలోని పలు గ్రామాలలో ఉన్న మూలమలుపులలో నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటూ ఎందరో అబాగ్యుల ప్రాణాల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఇకనైనా ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు చర్ల మండలంలో ప్రమాదబరితంగా మూల మలుపులలో ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించేలా చర్యలు చేపట్టడంతో పాటు ప్రమాద సూచిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఇటీవల జరిగిన ప్రమాదాల్లో కొన్ని..

- ఈనెల 24న మండలంలోని రాళ్లగూడెంలో యూ ఆకారంలో ఉన్న మలుపులో భద్రాచలం వైపు నుంచి వస్తున్న ఆటో చర్ల వైపు నుంచి భద్రాచలం వైపునకు వెళ్తున్న ప్రయివేటు బస్సు వేగంగా వస్తూ ఒక్కసారిగా ఎదురుపడడంతో దానిని తప్పించే క్రమంలో ఆటో బోల్తా పడగా వాజేడు మండలం ప్రగళ్లపల్లికి చెందిన ఒక మహిళ మృతి చెందింది.
- అదేరోజు సుబ్బంపేట సమీపంలో ఎదిరగుట్టల వద్ద మలుపులో వేగంగా వెళ్తున్న బైక్‌కు గుర్తు తెలియని వాహనం ఒక్కసారిగా ఎదురురావడంతో దానిని తప్పించే క్రమంలో బైక్ అదుపు తప్పి చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాకు చెందిన ఒక యువకుడు మృతి చెందాడు.
- ఫిబ్రవరి 11న మండలంలోని తేగడ–కలివేరు మధ్యలోని ప్రధాన రహదారిపై వేగంగా ప్రయాణిస్తున్న మినీ ఆటో టాటా మ్యాజిక్‌లు ఎదురెదురుగా ఢీ కొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్ స్వల్ప గాయాలతో భయటపడ్డాడు.
- జనవరి 21న మండలంలోని రాళ్లగూడెంలో యూ ఆకారంలో ఉన్న మలుపులో ద్విచక్ర వాహనం ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా రావడంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లాకు చెందిన ఓ యువకుడు మృతి చెందాడు.


ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన మహిళ(ఫైల్)

మొరపెట్టుకున్నా వినిపించుకోవడం లేదు



రాళ్లగూడెం మలుపులో ఐదారేళ్లగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. రోడ్డు వెడల్పుగా ఉండడం, వాహనాలు వేగంగా వస్తుండడంతో ఎదురెదురుగా ఢీకొని ప్రమాదాలు జరుగుతూ ప్రాణాలుపోతున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులకు ఎంతగా మొర పెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదు. ఇక్కడ ప్రమాదాలు నియంత్రించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలి. – రుంజా సుమన్, రాళ్లగూడెం

చర్యలు తీసుకోవాలి



మండలంలోని సీ కత్తిగూడెం, కొయ్యూరు, సుబ్బంపేట సమీపాల్లో ప్రధాన రహదారిపై ఉన్న మలుపుల్లో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాద సూచికలు లేకపోవడం, స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతోనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రమాదాలను అరికట్టి ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. – రేగళ్ల సుధాకర్, చర్ల